RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 13 సంచిక : 107 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 22 అక్టోబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-



## అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు

# రూ.కోటి పరిహారం

### పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు. "పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరుతున్నా. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ఇవాళ డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం.

ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదు. బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.



**అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత: డీజీపీ జితేందర్...** దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను స్మరించుకోవడం మన బాధ్యత అని డీజీపీ జితేందర్ అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసు శాఖ ముందు వరుసలో ఉందని వివరించారు.



## ప్రారంభమైన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 31,383 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లను అధికారులు మూసివేశారు. ఆలస్యంగా వచ్చినవారిని లోపలికి అనుమతించలేదు. తొలిరోజు జనరల్ ఇంగ్లీష్ పేపర్ పరీక్ష నిర్వహించారు. రేపటి నుంచి ఈనెల 27 వరకు వివిధ సబ్జెక్టుల ప్రకారం పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను వాయిదా వేయాలంటూ ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ విధించారు. దీని ప్రకారం 200 మీటర్ల వరకు ఐదుగురికి మించి ఉండేందుకు వీల్లేదు. ప్రతి కేంద్రం వద్ద ఒక ఎస్సై ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్ సహా మొత్తం ఆరుగురు కానిస్టేబుళ్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

పరీక్ష గది, చీఫ్ సూపరింటెండెంట్, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఈ నెల 21 నుంచి 27 వరకు జరిగే పరీక్షలకు సంబంధించి రోజూ ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు తరలించే జీపీఎస్ అమర్చిన వాహనాలు నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించేలా రూట్‌మ్యాప్ రూపొందించారు.

## కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలు..కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌లు రహస్య మిత్రులని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ కుర్చీ పోతుంటే బండి సంజయ్‌కు అంత బాధ ఎందుకని ప్రశ్నించారు. బండి సంజయ్ కామెంట్లపై స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలవి రహస్య ఒప్పందాలని.. ఖచ్చితంగా బయటకు వస్తాయని కేటీఆర్ అన్నారు.

**ముత్యాలమ్మ గుడిపై దాడిని తాను ఖండిస్తే తప్పా..** ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి వార్షికోత్సవం జరుపుకోవాలని ఎద్దేవా చేశారు. ఇవాళ(సోమవారం) తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... ముత్యాలమ్మ గుడిపై దాడిని తాను ఖండిస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. తాను ట్వీట్ చేసినందుకు సైబర్ క్రైమ్ అధికారులు లేఖ పంపారని అన్నారు. రేవంత్‌రెడ్డి లాంటి దగుల్బాజీ ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేరని విమర్శించారు. ఉద్యోగాల కల్పనపై సీఎం రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. మూసీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ కంటే జర్నలిస్టులే ఎక్కువ ప్రశ్నించాలని కేటీఆర్ అన్నారు.

**జర్నలిస్టులపై బీఆర్ఎస్ పార్టీకు ఎనలేని గౌరవం..** రేవంత్ ప్రభుత్వం లక్షన్నర కోట్లు మూసీలో పోద్దామంటే చూస్తూ ఊరుకుందామా? అని నిలదీశారు. లక్షన్నర కోట్లు రేవంత్ జేబులో వేసుకుంటామంటే ఊరుకుంటామా? అని అడిగారు. జర్నలిస్టులపై బీఆర్ఎస్ పార్టీకి ఎనలేని గౌరవం ఉందని.. ఎన్నడూ తాను జర్నలిస్టులను అవమానించలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమకంటే జర్నలిస్టుల పాత్ర ఎక్కువగా ఉందని చెప్పారు. మూసీ కోసం ప్రభుత్వం పెడుతున్న తంటాలు చూస్తుంటే బాధకలుగుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసంబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడం రాష్ట్ర పురోగతికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ చార్జీలను రూ.10నుంచి రూ.50కు పెంచాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇప్పటికే కరెంటు కోతలతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

**సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం...** "ప్రభుత్వం పట్టుదలకు పోవటంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. రిట్ ఫిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకునే వరకు ఫలితాలు వెల్లడించవద్దని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. రిట్ పిటిషన్‌పై వేగంగా వాదనలు విని నిర్ణయం తీసుకోమని సుప్రీం హైకోర్టుకు చెప్పింది. జీవో నెంబర్ 29కు వ్యతిరేకంగా హైకోర్టులో అభ్యర్థుల తరుపున కొట్లాడుతాం. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో అధికారంలోకి తీసుకువచ్చిందే నిరుద్యోగులు. లోకల్స్ కోసం కేసీఆర్ 95శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారు. తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రమాణికం కాదని చెప్పటం అన్యాయం. జీవో నెంబర్ 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు విఘాతం. గ్రూప్ - 1 అభ్యర్థుల తరుపున సుప్రీంకోర్టులో కేసు వేసిందే బీఆర్ఎస్. కపిల్ సిబల్ లాంటి ప్రముఖ న్యాయవాదిని తాము నియమించాం" అని కేటీఆర్ వెల్లడించారు.

## ఆలయాలపై దాడులు అరికట్టాలి.. గవర్నర్‌కు భాజపా ఎంపీల వినతి

హైదరాబాద్: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను భాజపా నేతలను కలిశారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఆయనతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఆలయాలపై



జరుగుతున్న దాడులను అరికట్టాలని గవర్నర్‌ను కోరారు. అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. ధార్మిక సంఘాల నేతలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

వాటిని ఎత్తివేసేలా చూడాలన్నారు. తెలంగాణలో అసలు నిఘా వ్యవస్థ పని చేస్తోందా అని ప్రశ్నించారు. దేవాలయాలపై దాడులు జరుగుతుంటే సీఎం స్పందించరా? అని నిలదీశారు.



# 'బండి' మళ్లీ యాక్టివ్...

# కేడర్‌లో ఫుల్ జోష్...!

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది ఎమ్మెల్యే, మరో ఎనిమిది ఎంపీ సీట్లను గెల్చుకుని గతంతో పోలిస్తే ప్రాతినిధ్యాన్ని పెంచుకున్నా.. దాదాపు ఐదారు నెలలుగా పార్టీ తరఫున ఎలాంటి యాక్టివిటీ చేపట్టలేదనే నిరుత్సాహం బీజేపీ శ్రేణుల్లో నెలకొన్నది. ఒకవైపు పార్టీ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నత్తనడకన సాగుతుండటంపై పార్టీ కేంద్ర నాయకుడు బన్సల్ సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు.

పార్టీకి స్టేట్ చీఫ్‌గా కిషన్‌రెడ్డి ఉన్నా రాష్ట్రంలో ఆందోళనలకు ఎలాంటి ప్రోగ్రామ్ ఇవ్వలేదని రాష్ట్ర నాయకులూ నిరుత్సాహంతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న హైడ్రా, మూసీ పునరుజ్జీవం కార్యక్రమాలపై పార్టీ విధాన నిర్ణయం తెలియక ఎమ్మెల్యేలు, ఎంపీలు తలో మాట మాట్లాడుతున్నారు.

ప్రజలతో కలిసి ఆందోళనలు నిర్వహించడం, రోడ్డెక్కే కార్యక్రమాలు లేవని నీరసంగా ఉన్న పరిస్థితుల్లో గ్రూప్-1 అభ్యర్థులకు సంఘీభావం తెలిపేందుకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అశోక్‌నగర్ వెళ్లి 'చలో సెక్రెటేరియట్' పిలుపు ఇవ్వడంతో ఒక్కసారిగా విద్యార్థి, యువత, మహిళా విభాగాల్లో జోష్ పెరిగింది.

**ఒకే ఒక్క ప్రోగ్రామ్‌తో కేడర్‌లో ఉత్సాహం :** ఇంతకాలం ఎలాంటి చడీచప్పుడు లేకుండా సైలెంట్‌గా ఉన్న పార్టీ యాక్టివిటీస్ బండి సంజయ్ పాల్గొన్న ఒకే ఒక్క ప్రోగ్రామ్‌తో మళ్లీ ఉత్సాహం పెరిగిందనే అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమైంది. ఇలాంటి ప్రోగ్రామ్స్ ఇకపైన కూడా కొనసాగాలనే అభిప్రాయాన్ని పలువురు స్టేట్ లీడర్లు వ్యక్తం చేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ఇంతకాలం శ్రేణులు నీరస పడ్డాయని, పార్టీ లీడర్లతో ఎమ్మెల్యేలు, ఎంపీలకు గ్యాప్ పెరిగిందని, ఈ అగాధాన్ని పూడ్చడానికి రాష్ట్ర నాయకత్వం అందుబాటులో లేకపోవడం మరో కారణమని ఆ పార్టీకి చెందిన పలువురి ఆవేదన. ఇప్పటికే రాష్ట్ర పార్టీలో గ్రూపు తగాదాలు పెరిగిపోవడంతో గ్రూప్-1 అభ్యర్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సంఘీభావం తెలపడంతో మైలేజ్ ఆయనకు వచ్చిందనే అక్కసు కూడా కొంతమందిలో వినిపిస్తున్నది. స్తబ్దుగా ఉన్న పార్టీలో ఒక్కసారిగా జోష్ పెరగడం అనుబంధ విభాగాల్లో సంతోషంగా ఉన్నా కొందరు లీడర్లలో మాత్రం భిన్నాభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**పార్టీకి ప్లస్ అయిన సంజయ్ అరెస్ట్...** బండి సంజయ్‌ను అరెస్టు చేయడంతో పార్టీ కేడర్ సచివాలయం ముందుకు వెళ్లి రోడ్డుపై కూర్చుని నిరసన తెలపడం, వారిని కూడా పోలీసులు అరెస్టు చేయడంతో పార్టీకి ప్లస్ పాయింట్ అనే వాదన కూడా ఆ పార్టీలో వినిపిస్తున్నది. ఇదే తరహా కార్యక్రమాలు ఇకపై కూడా కొనసాగాలని, కనీసం వారానికొకటైనా పార్టీ టేకప్ చేయాలని కేడర్ కోరుకుంటున్నారు. రుణమాఫీ, రైతు భరోసా, ఆరు గ్యారంటీల అమలు, హైడ్రా కూల్చివేతలు, మూసీ పునరుజ్జీవం.. ఇలాంటి అంశాలన్నింటిపై పార్టీ ప్రోగ్రామ్ తీసుకుంటే ఒకవైపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొట్లాడినట్లు మాత్రమే కాక మరోవైపు పొలిటికల్ స్పేస్‌లో బీఆర్ఎస్‌కు దీటుగా బీజేపీ ఎస్టాబ్లిష్ అవుతుందనేది వారి వాదన. పార్టీలో గ్రూపుల సంగతి ఎలా ఉన్నా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో పోలిస్తే యాక్టివిటీస్‌లో ఎక్కడా తగ్గకుండా ఉంటామన్నది వారి అభిప్రాయం. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఇందిరా పార్కు దగ్గర బీజేపీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరిగిన రైతు దీక్ష మినహా పార్టీ తరఫున నిర్వహించిన పెద్ద ప్రోగ్రామ్ ఏదీ లేదని శ్రేణులు తెలిపాయి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీ టీం లో పవన్... మహా సమరంలోకి రెడీ ?

జనసేన అధినేత తెలుగుదేశం కూటమి లో కీలకమైన ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ మోడీ అమిత్ షాల టీం లో ఉన్నారా అంటే జరుగుతున్న ప్రచారం మాత్రం అవును అనే అంటోంది. పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో బీజేపీకి ఇష్టమైన సనాతన ధర్మాన్ని పఠిస్తున్నారు. ఆయన శ్రీవారి లడ్డూ కల్తీ అయింది అన్న దాని మీద ఏకంగా పద కొండు రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. అంతే కాదు ఈ దేశానికి సనాతన ధర్మ పరిరక్షణ బోర్డులు అవసరం అన్నారు. ఆయన ఈ మేరకు వారాహి డిక్లరేషన్ చేశారు. హిందూత్వకు ప్రాణం ఇచ్చే బీజేపీకి అనుగుణంగా పవన్ కూడా మాట్లాడుతున్నారని వామపక్షాలు ఇతర సంఘాలు విమర్శలు కూడా చేశాయి. అయితే అవతల వైపు చూస్తే బీజేపీకి పవన్ మీద మరింత గురి కుదిరింది అని అంటున్నారు. బీజేపీకి ఎన్డీయేలో ఎందరో మిత్రులు ఉన్నారు. కానీ బీజేపీ ఫిలాసఫీకి మద్దతుగా నిలిచే పార్టీలు అయితే లేవు. గతంలో శివసేన ఉండేది. కానీ ఆ పార్టీ గత అయిదేళ్లుగా బీజేపీకి ఎదురు నిలిచి ఇండియా కూటమిలో ఉంటోంది. ఇపుడు శివసేన ప్లేస్ ని జనసేన భర్తీ చేస్తుందా అన్న చర్చ అయితే సాగుతోంది. ఇదిలా ఉంటే మహారాష్ట్ర ఎన్నికలు బీజేపీకి అత్యంత కీలకం అని అంటున్నారు. ఈసారి కనుక గెలవకపోతే చాలా తేడాలు వచ్చేస్తాయి. దాంతో సర్వ శక్తులను అక్కడ ఒడ్డుతున్న బీజేపీ తన వద్ద ఉన్న అస్త్ర శస్త్రాలు అన్నీ ప్రయోగిస్తోనిద్. నవంబర్ 20న జరిగే ఈ ఎన్నికలకు అట్టే సమయం కూడా లేదు. దాంతో భారీ ఎత్తున ప్రచారం చేపట్టడానికి బీజేపీ మోడీ టీం ని తయారు చేశారు అని అంటున్నారు. అందులో ఉద్ధండులు అయిన బీజేపీ ముఖ్యమంత్రులు మాజీ ముఖ్యమంత్రులు కీలక నేతలు ఎంతో మంది ఉన్నారు. ఇక ఎన్డీయే మిత్రుల విషయానికి వస్తే జనసేన అధినేత పవన్ ని కూడా తమ టీం లోకి తీసుకున్నారు అని అంటున్నారు. పవన్ కి ఉన్న సినీ గ్లామర్ తో పాటు ఆయన సనాతనవాదిగా మారిన తరువాత అగ్రెస్సివ్ మోడ్ లో ఇస్తున్న స్పీచులతో ఈసారి ఉత్తరాది ఊగిపోతుందని కూడా లెక్క వేస్తున్నారు. దాంతో పవన్ ని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలోకి దింపుతారు అని అంటున్నరరు. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం మీద వ్యాఖ్యలతో ఆయన ఒక్కసారిగా నేషనల్ ఫిగర్ గా మారిపోయారు. పవన్ కళ్యాణ్ లేవనెత్తిన సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు విషయంలో కూడా జాతీయ స్థాయిలో బిగ్ డిబేట్లు సాగాయి. దాంతో పవన్ కి ఉత్తరాదిన ఆదరణ వేరే లెవెల్ లో ఉంటుందని అంతా ఊహిస్తున్నారు. పవన్ మరి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్తారా బీజేపీ కూటమి తరఫున ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తారా అన్నది అయితే చర్చగా ఉంది. పవన్ కనుక మహా ఎన్నికల సమరంలోకి దూకితే అది జనసేనకు బీజేపీకి మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంచుతుందని అంటున్నారు. రానున్న రోజులలో ఏపీతో పాటు దేశంలో జరిగే అనేక రాజకీయ మార్పులకు కూడా దారి తీస్తుందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే పవన్ కి బీజేపీ కేంద్ర నాయకత్వం పెద్ద పీట వేస్తోందని ఆయనను అత్యంత నమ్మకమైన మిత్రుడిగా చూస్తోందని అంటున్నారు. పవన్ విషయం తీసుకుంటే ఆయనకు మోడీ పట్ల ఎంతో అభిమానం ఉంది అన్నది తెలిసిందే. సో రానున్న రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయో అంతా వేచి చూడాల్సిందే.

## పోలీస్ అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేడు కనిపిస్తున్న శాంతి,సౌభ్రాతృత్వం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయాలు కొనసాగిద్దాం:జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్







**గంభీరావుపేట (సిరిసిల్ల)అక్టోబర్ 21(ప్రభాత సమాచారం)**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 08 మందికి పైగా పోలీసులు అసువులు బాసారని,వారి త్యాగ ఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని,పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఇట్టి కార్యక్రమానికి హాజరైన త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థుతులు వారి యొక్క సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించినరాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా,ఎస్పి అఖీల్ మహాజన్.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూపోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని,ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 21 నుంచి 31 వరకు జాతీయ ఐక్యత కోసం ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూసమాజంలో శాంతి స్థాపన కోసం అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరనీయమని , అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందని తెలిపారు. దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహారా కాస్తున్న 10 మంది సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, అప్పటినుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. విధి నిర్వహణ సందర్భంగా ఎన్నో జటిలమైన సవాళ్లు ఎదురవుతున్నా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.దేశవ్యాప్తంగా ఈసంవత్సరంలో తీవ్రవాదులు,సంఘ విద్రోహక శక్తుల్లో 214 మంది పోలీసులు అమరులయ్యారనీ,వారి త్యాగాలను స్మరించుకుంటూ వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమం, వారికి ఆర్థిక పరమైన ప్రయెజనాలను సర్వస్వం లభింపచేయడం,అయా కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు మనం అందించే నిజమైన నివాళి పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఈ రోజు నుండి 31 తేదీ వరకు రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలీ,క్యాండిల్ ర్యాలీ,2%ని% రన్,ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందని,పోలీస్ అమరవీరుల కుటుంబాలకు దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులు అర్పించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళి కృష్ణ, సి.ఐ లు,ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, సిబ్బంది అమరుల కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలం కేటాయించాలి

### బిజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోడె రమేష్



**గంభీరావుపేట అక్టోబర్ 21(ప్రభాత సమాచారం)**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలం ఏర్పాటుకు మరియు శాశ్వత స్థలం ఏర్పాటు చేసేవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల సమీపంలో ప్రమాదపు హెచ్చరిక బోర్డులు ఏర్పాట్లు చేయాలనీ బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కోడే రమేష్ సోమవారం జిల్లా కలెక్టర్ కి మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కోడె రమేష్ మాట్లాడుతూ అధిక తూకాన్ని అరికట్టుట గురించి రైతులు ఆరుకాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని అమ్ముకోవడానికి గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పాలించిన కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయడంలో విఫలమైంది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయిన రైతుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి కొనుగోలు కేంద్రానికి 5 ఎకరాల శాశ్వత స్థలాలను కేటాయించాలని అప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల సమీపంలో గల రోడ్డుపై ధాన్యాన్ని ఎక్కడైతే ఆరబెట్టుకుంటున్నారో అక్కడ ప్రమాదపు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అప్పటివరకు రైతులు పండించిన పంటను ఆరబెట్టి అమ్ముకోవడానికి కనీస సౌకర్యం లేనందున ధాన్యం కొనుగోలు కేంద్రాల సమీపంలో గల రోడ్డుకు ఒకవైపు దాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులను పోలీసు వారు భయభ్రాంతులకు గురి చేయకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన దగ్గర ప్రమాదపు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లయితే రైతులకు అధిక శ్రమ మరియు అధిక భారం కలగకుండా ఉంటుంది. కావున తక్షణమే ప్రమాదపు హెచ్చరిక బోర్డులు ఏర్పాట్లు చేయవలసిందిగా సవినయంగా మనవి చేస్తూ మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధిక తూకాన్ని అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా వాహన దారులకు రైతుల తరపున ప్రత్యేక విన్నపం ధాన్యం కొనుగోలు కేంద్రాల సమీపంలో నెమ్మదిగా ప్రయాణాన్ని కొనసాగించి ప్రమాదాలు జరగకుండా రైతులకు బాసటగా, మద్దతుగా నిలువాల్సిందిగా కోరారు.

## అయ్యో.. అన్నదాత!



కరీంనగర్ : అయిదు నెలలు కష్టపడి పంటను తీశారు. మరికొన్ని రోజుల్లో దానిని విక్రయించి లాభాలు పొందాలనుకున్నారు. కానీ భారీ వర్షం కర్షకులను కంటతడి పెట్టించింది. జిల్లాలో పలు చోట్ల కురిసిన వర్షానికి మార్కెట్లో, కొనుగోలు కేంద్రాల్లో, బయట ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొన్ని చోట్ల కొట్టుకుపోయింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి ధాన్యాన్ని తూకం వేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరి పైరు నేలవాలింది.

కరీంనగర్‌లో తెల్లవారుజామున పడిన పిడుగులకు వివిధ ప్రాంతాల్లోని విద్యుత్తు ఉపకరణాలు కాలిపోవడంతో కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. కరీంనగర్ పద్మనగర్‌లోని 132 కేవీ ఉప విద్యుత్తు కేంద్రంలో పిడుగుపాటుకు సుమారు రూ.లక్ష విలువ చేసే నియంత్రిక కాలిపోయింది. భారీ ఎత్తున మంటలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రభావానికి ఉపకేంద్రం పరిధిలోని ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్, ఆచంపల్లి ప్రాంతాల్లోని 33 కేవీ ఉప విద్యుత్తు కేంద్రాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అధికారులు ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్తును పునరుద్ధరించారు. కాలిపోయిన నియంత్రికలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ఎస్ఈ వడ్లకొండ గంగాధర్‌ను సంప్రదించగా పిడుగు పాటుకు కాలిపోయిన ఉపకరణాల వివరాలు పూర్తి స్థాయిలో తెలియరాలేదని, పూర్తి స్థాయిలో నివేదిక అందిస్తామని తెలిపారు. పిడుగుల ధాటికి చింతకుంట, శాంతినగర్ ప్రాంతంలోని నాలుగు, అయిదు నియంత్రికలు కాలిపోగా 11 కేవీ లైన్‌లో ఇన్సులేటర్లు పగిలిపోయాయి.చింతకుంట, శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా లేక ప్రజలు ఇబ్బందిపడ్డారు. చింతకుంటలోని పలువురి ఇళ్లల్లో పెద్ద ఎత్తున ఫ్యాన్లు కాలిపోయాయి. శాతవాహన విశ్వవిద్యాలయంలో కరెంటు సరఫరా నిలిచిపోవడంతో పీజీ కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఇబ్బంది పడ్డారు.ఓ వైపు వాన.. మరో వైపు ఉక్కబోత

జిల్లా కేంద్రంలో భిన్న వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేకువజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అనంతరం ఎండ కాచి.. సాయంత్రం మళ్లీ వాన పడింది. మరో వైపు ఎండతో నగరవాసులు ఉక్కబోత భరించలేక పోయారు. నగరంలో కురిసిన వర్షానికి రహదారులు జలమయమ య్యాయి. మట్టి రోడ్లపై నీరు నిలిచి మరింత గుంతలు తయారయ్యాయి.

## విపణి ఆదాయం.. లక్ష్యం అధిగమించె

తాండూరు : జిల్లాలోని వ్యవసాయ విపణులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల్లో లక్ష్యానికి మించిన ఆదాయం సాధించాయి. పది విపణిల్లో తాండూరు విపణికి ప్రత్యేక శ్రేణి హోదా ఉంది. గ్రేడ్-1 విపణిగా వికారాబాద్, గ్రేడ్-2 విపణులుగా పరిగి, మర్పలికి పేరుంది. మిగిలిన బషీరాబాద్, ధారూర్, కొడంగల్, కోట్‌పల్లి, కుల్కచర్ల, నవాబుపేట విపణులు సహాయ కార్యదర్శి హోదాకు సంబంధించినవి. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ప్రభుత్వం రూ.7.42 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని విధించింది. అయితే రూ.6.42 కోట్లు ఎక్కువతో రూ.13.84 కోట్లు ఆదాయాన్ని ఆర్జించాయి. గడచిన 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 5.62 కోట్ల లక్ష్యానికి గాను రూ.4.16 కోట్ల ఆదాయమే వచ్చింది.

మొదటి స్థానంలో కొడంగల్ విపణి

జిల్లాలోని పది విపణిల్లో కొడంగల్ విపణి ఎక్కువ ఆదాయం



సమకూర్చుకుని మొదటి స్థానంలో నిలిచింది. తాండూరు, పరిగి, వికారాబాద్ రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. మిగిలిన విపణిలు రూ.4వేల నుంచి 1.30 లక్షల ఆదాయాన్ని మాత్రమే సమకూర్చుకున్నాయి. కొడంగల్ విపణి ఆర్థిక లక్ష్యం రూ.96.50 లక్షలుగా ఉంటే 3.75 కోట్లు సమకూరాయి. గడచిన వానాకాలంలో రైతులు 5,78, 874 సాధారణసాగు విస్తీర్ణానికి గాను 5,30,882 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. అయితే దిగుబడులు వచ్చింది మాత్రం కేవలం పెసలు, మినుములు, సోయాబిన్ పైర్ల నుంచే. సాగు కూడా తక్కువగానే ఉంది. పెసలు 12,513 ఎకరాలు, మినుములు 5,108 ఎకరాలు, సోయాబిన్ 2,185 ఎకరాల్లో సాగైంది. వీటి నుంచి వచ్చిన దిగుబడులు నామమాత్రమే. పెద్దగా ఆదాయం సమకూరలేదు. అయితే గతేడాది కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన లక్షల క్వింటాళ్ల ధాన్యం, పత్తికి సంబంధించిన మార్కెట్ ఫీజు తాజా ఆర్థిక సంవత్సరంలో సమకూరింది. దీన్ని లెక్కలోకి తీసుకున్నారు.

వచ్చే ఆరు నెలల్లో మరింత ఆదాయం

వ్యవసాయ విపణిలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలోని మిగిలిన ఆరు నెలల్లో మరింత ఆదాయం సమకూరనుంది. కందులు, మక్కజొన్నలు, పసుపుతో పాటు పత్తి, ధాన్యం విక్రయాలు భారీగా జరగనున్నాయి. వీటి విక్రయ విలువలో రూ.100కు 1శాతం చొప్పున వచ్చే ఆదాయం రూ.కోట్లల్లోనే ఉంటుంది. విపణిలకు సమకూరిన ఆదాయంతో పాలక వర్గాలు చేసిన తీర్మానాలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొంది రైతులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తాం.- సారంగ పాణి, జిల్లా వ్యవసాయ విపణుల అధికారి.

## ఇరుకు వంతెనలు.. ప్రమాద ఘంటికలు

చేగుంట: ప్రధాన మార్గాల్లో రోడ్లు వేసి వంతెనలు విస్తరించకపోవడం.. కల్వర్టులకు ఇరువైపులా గోడలు, దిమ్మెలు.. హెచ్చరిక బోర్డులు సైతం లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి కల్వర్టు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఏడుగురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన నుంచైనా అధికారులు సత్వరమే తేరుకుని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. తూప్రాన్ నుంచి గుండ్రెడ్డిపల్లి వెళ్లే దారిలో ఆబోత్‌పల్లి సమీపంలో కల్వర్టుకి ఇరువైపులా దిమ్మెలు వర్షాలకు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు, రాత్రి సమయంలో అజాగ్రత్తగా ఉంటే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది.చేగుంట మండలం మక్కరాజుపేట నుంచి చందాయిపేటకు వెళ్లే మార్గంలో ఇరుకైన వంతెన ఉంది. ఏడాది పొడవునా నీరుంటుంది. ఇక్కడ ప్రయాణం ప్రమాదకరమే. ముఖ్యంగా రాత్రి ఏమరుపాటుగా ఉంటే అంతే సంగతులు.

రోడ్డు విస్తరిస్తూ.. కల్వర్టులు వదిలేసి..

నర్సాపూర్-తూప్రాన్ 161ఏఏ జాతీయ రహదారి శివ్వంపేట మండలం ఉసిరిక పల్లి నుంచి వెల్దుర్తికి ఉన్న ఒక వరుస రహదారిని రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. రూ.18 కోట్లతో ఉసిరికపల్లి, పాంబండ, పోతులబోగుడ చౌరస్తా వరకు, దొంతి నుంచి గుండ్లపల్లి రోడ్డు కొంత వరకు తొమ్మిది కిలోమీటర్లు విస్తరిస్తున్నారు. పది నెలలుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉసిరికపల్లి వద్ద గోడలు లేకుండా రెండు వైపుల చిన్న రాతి దిమ్మెలతో ఇరుకుగా ప్రమాదకరంగా ఉంది. ఇక్కడే బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఈఈ సర్దార్‌సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్మాణంలో ఉన్న రోడ్లతో పాటు వంతెనల పనులకు నిధులున్నాయన్నారు. పెద్ద బ్రిడ్జిలైతే నిర్మాణం చేయాల్సి ఉంటుందన్నారు.

## గిరిజన న్యాయ కళాశాల పిలుస్తోంది!

సంగారెడ్డి :గిరి పుత్రులను న్యాయ విద్యలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట న్యాయ కళాశాలను ఏర్పాటుచేసింది. దేశంలో గిరిజన (పురుషుల) గురుకుల న్యాయ కళాశాల ఇదొక్కటే కావడం విశేషం. ప్రస్తుతం న్యాయ విద్య కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 19న తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఇక్కడ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం విశేషం.

ఐదేళ్ల కోర్సు..ఇంటర్ అర్హతతో లాసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్లు సైతం వర్తింపజేస్తారు. ఇక్కడ సీటు సాధిస్తే ఐదేళ్లలో న్యాయ విద్య కోర్సు (బీఏ, ఎల్ఎల్‌బీ) పూర్తి చేయవచ్చు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతోంది. ఏటా 60 మందికి తొలి సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ కళాశాలను ఎంచుకోకపోవడంతో సీట్లు మిగిలిపోతున్నాయి. గత విద్యా సంవత్సరం 34 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు షురూ అయిన నేపథ్యంలో ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

మెరుగైన సదుపాయాలుకళాశాలలో సీటు సాధిస్తే ఎలాంటి ఖర్చు లేకుండానే కోర్సు పూర్తి చేయవచ్చు. భోజన, వసతి సదుపాయాలు ఉంటాయి. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 కంప్యూటర్లతో కూడిన ఈ-గ్రంథాలయం కూడా ఉండటం విశేషం. విద్యార్థుల ఆరోగ్యానికి బాటలు వేసేలా ఆధునిక వ్యాయామశాల ఏర్పాటుచేశారు. సద్వినియోగం చేసుకోవాలి నిరీక్షణరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్

# కాలువ స్థలాల కబ్జా



గంగాధర: పట్టా భూములైనా, సర్కారు భూములైనా కబ్జాకు కాదేది అనర్హమంటూ ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. మారుమూల పల్లెల్లో సైతం గుంట స్థలం రూ.లక్షల్లో ధరలకు రెక్కలు రావడంతో ఇక వాణిజ్య స్థలాలను వదలిపెట్టడంలేదు. ఇందుకు చెరువులు, కుంటల శిఖం భూములతోపాటు సాగునీటి కాలువలను సైతం కబ్జా చేస్తున్నారు. అక్రమ కట్టడాలకు పాల్పడుతుండగా అవి కాస్తా కుచించకపోయి వాటి ఉనికికే ప్రమాదం ఏర్పడింది.

గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం పరిధిలో మంగపేట ఎల్లమ్మ చెరువు నుంచి వేములవాడకు కుడి కాలువ 19 కి.మీ ఇప్పటికే పూర్తి చేశారు. కాలువ 60 మీటర్ల వెడల్పుతో నిర్మించగా కుడి వైపు దారికి 4 మీటర్లు, ఎడమ వైపు దారికి 6 మీటర్ల స్థలం వదిలిపెట్టారు. ఇక వాణిజ్య కేంద్రంగా ఉన్న గంగాధర ప్రధాన కూడలిలో మాత్రం 1.6 కి.మీ పొడవునా 45 మీటర్ల వెడల్పుతో ఇరువైపులా దారులకు స్థలం వదిలి కాలువ తవ్వారు. ఈ కాలువ పరిధిలో 12 డిస్ట్రిబ్యూటరీలు, వాటికింద ఉపకాలువల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టారు. ఇక ర్యాలపల్లి వైపు ఎడమకాలువ 20.5 కి.మీ 40 మీటర్ల వెడల్పుతో పూర్తి చేయగా దానికింద 10 ఉపకాలువలు తవ్వారు. భూసేకరణ జరిపి బాధితులకు అప్పటికే నష్టపరిహారం అందజేశారు.

**తేల్చని హద్దులతో ఆక్రమణలు**

గ్రామీణ ప్రాంతాల్లో కాలువ పక్కనున్న భూములు పంటలకు అనువుగా ఉండి కొందరు ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన గంగాధర ప్రధాన కూడలి (మధురానగర్ గ్రామ పంచాయతీ)లో గుంట స్థలం కనీస ధర రూ.15 లక్షలు పలుకుతుండగా కబ్జారాయుళ్ల కన్నుపడింది. గంగాధర ప్రధాన కూడలి నుంచి కురిక్యాల రెవెన్యూ శివారు (పిట్టలపల్లి) వరకు 1.6 కి.మీ వాణిజ్య కేంద్రంగా ఉండి ఇక్కడి భూములకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండు ఉంది. కొందరు కాలువ పక్కనున్న దారులను వదిలిపెట్టకుండా ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారు. గతంలో కాలువ నిర్మాణం జరుగుతుందని తెలిసి కొందరు అక్రమ కట్టడాలతో నష్టపరిహారం పొందగా, మరికొందరు కాలువ తవ్వకం జరిగి దారులకు వదిలిపెట్టిన స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టారు. ఇంకొందరు ఇదంతా తమదే స్థలమంటూ కాలువ భూములను అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటంతటికీ సాగు నీటి శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలున్నాయి. కాలువ నిర్మాణానికి భూసేకరణ జరిపిన అధికారులు అప్పట్లోనే హద్దులు నిర్ణయించి కంచె వేస్తే విలువైన భూములు కబ్జాకు గురయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే ఎల్లంపల్లి పైపులైన్ల వెంట దారులతోపాటు పైపులైన్ల పైభాగాన్ని ఆక్రమించి పంటలు వేస్తుండగా పైపులైన్లకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి కాలువల భూములు కాపాడాల్సిన అవసరముంది.

**సర్వే చేసి తొలగిస్తాం**

నిర్మాణ దశలో ఉన్న కాలువ భూములు ఎవరు ఆక్రమించినా సర్వే చేసి తొలగిస్తాం. కాలువకు కుడి వైపు ఆరు మీటర్లు, ఎడమ వైపు 7 మీటర్ల దూరంలో మురుగుకాలువలు నిర్మించి దారులు వేయాల్సి ఉంది. ఇప్పటికే భూసేకరణ జరిపి నష్టపరిహారం కూడా అందజేశాం. గతంలో నిర్మించిన వాటికి కూడా పరిహారం అందజేశాం.

వజహత్ అలీ, ఏఈ

# ఏటీసీ.. భవితకు దశదిశ

గంగాధర: ప్రభుత్వ ఐటీఐల్లో పారిశ్రామికరంగ అవసరాలను తీర్చేలా ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్లు) అందుబాటులోకి వస్తున్నాయి. మల్లేపల్లి ప్రభుత్వ మోడల్ ఐటీఐలో ఏర్పాటు చేసిన ఏటీసీలో తరగతులు ప్రారంభమయ్యాయి.

ఇవీ కోర్సులు.. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్), మెకానికల్ బ్యాటరీ, ఎలక్ట్రికల్ వాహనాలు తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐతో పాటు ఇదే ప్రాంగణంలోని శాంతినగర్, సనత్‌నగర్, ఖైరతాబాద్, విజయనగర్‌కాలనీ ఐటీఐల్లోనూ ఏటీసీలు కేంద్రాలను నెలకొల్పుతున్నారు.




రూ.36 కోట్లతో నిర్మాణం.. ఒక్కో ఏటీసీ కేంద్రాన్ని 13500 చదరపు అడుగుల స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు. భవనం, సామగ్రికి కలిపి రూ.36 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఏటీసీల్లో శిక్షణ పొందే వారికి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

విద్యార్థులకు అవకాశాలు – పి.నర్సయ్య, డిప్యూటీ డైరెక్టర్, ఉపాధి శిక్షణ శాఖ ఏటీసీల్లో శిక్షణ పొందే విద్యార్థులకు వందశాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. ఈ నెల 19 వరకు తక్షణ ప్రవేశాలు పొందొచ్చు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు కొత్త కోర్సుల్ని ప్రవేశ పెట్టాం.

# కర్షకులకు కలిసొచ్చే మద్దతు ధరలు

తాండూరు : కేంద్ర ప్రభుత్వం యాసంగిలో సాగు చేసే శనగ (బెంగాల్‌గ్రామ్) సహా ఆరు పంటలకు మద్దతు ధరలు పెంచడంతో జిల్లా రైతులు ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఏర్పడింది. ప్రస్తుత యాసంగి సాగుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఆవాలు, మసూర్ దాల్ (ఎర్రకంది పప్పు), బార్లీ, గోధుమ, కుసుమ, శనగ పంటలకు మద్దతు ధరను పెంచుతూ ప్రకటన చేసింది. జిల్లాలో ఆవాలు, ఎర్రకంది పప్పు, బార్లీ పంటలను సాగు చేయరు. శనగ, కుసుమను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే గోధుమను నామమాత్రంగా సాగు చేస్తారు. ఈ మూడు పంటలకు దక్కే మద్దతు ధరతో ఆర్థిక లబ్ధి




పొందనున్నారు.

**పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువ**

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగిలో రైతులు శనగ, కుసుమ, గోధుమ సాగు చేపట్టారు. తాజాగా పెరిగిన మద్దతు ధరల నేపథ్యంలో రైతులు పంటను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచిన పంటల సాగుకు పెట్టుబడి తక్కువ..దిగుబడి ఎక్కువగా ఉంటుంది. శనగ పంట సాగుకు ఎకరాకు అన్ని ఖర్చులు కలిపి రూ.8,000 అవుతుంది. సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రేగడి పొలాల్లో 6 నుంచి 7 క్వింటాళ్లు, సాధారణ పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. కుసుమ సాగుకు పెట్టుబడి రూ.12,000 అవుతుంది. రేగడి పొలాల్లో 7 నుంచి 8 క్వింటాళ్లు, సాధారణ పొలాల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. ఇక గోధుమల సాగుకు రూ.10 వేలు పెట్టుబడి అవుతుంది. దిగుబడి 8 క్వింటాళ్ల వరకు వస్తుంది.

# చిల్లర చిక్కులకు చెల్లు.. 2నెలల్లో బస్సుల్లో పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపులు

హైదరాబాద్: ఆర్టీసీ ప్రయాణికులకు చిల్లర కష్టాలు తీరనున్నాయి. బస్సుల్లో కండక్టర్, ప్రయాణికులకు మధ్య చిల్లర గొడవలు నిత్యకృత్యమయ్యాయి. ఈ సమస్యను తీర్చేందుకు పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు సంస్థ సమాయత్తమైంది. ఇందుకు సంబంధించి బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ డిపోల్లోని 140 బస్సుల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు విశేష స్పందన రావడంతో రెండు నెలల్లో గ్రేటర్‌లోని అన్ని డిపోల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. అవసరమైన 4,500 ఇంటలిజెంట్ టికెటింగ్ యంత్రాలను(ఐటిమ్స్)ను సమకూర్చుకుంటోంది. ఇంటర్నెట్ ఆధారంగా ఇవి పనిచేయనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 10,000 ఐటిమ్స్ యంత్రాలు అవసరమవుతుండగా సగం మేర గ్రేటర్‌లోనే వినియోగించనున్నారు. తద్వారా క్యూఆర్ కోడ్ స్కానింగ్, కార్డు స్వైపింగ్‌తో ప్రయాణికులు టికెట్ కొనే వెసులుబాటు కలుగనుంది.

**పెద్దనోట్లతో పరేషాన్**

గ్రేటర్‌లో మెజార్టీ ప్రయాణికులు డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. బస్సుల్లో టికెట్ కొనుగోలుకు రూ.100, రూ.200 నోట్లు ఇస్తుండటంతో కండక్టర్లకు ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతోంది. రూ.10 నాణేలను తీసుకోవడంలోనూ కండక్టర్లు, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈ నాణేన్ని తీసుకోవాలని ఆర్బీఐ కోరుతున్నా, స్వయంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించినా కొన్ని బస్సుల్లో తీసుకోవడం లేదంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు ప్రారంభమైతే చిల్లర కష్టాలు తీరిపోనున్నాయి.

**విద్యార్థుల బస్‌పాస్‌కు యాప్..**

గ్రేటర్ పరిధిలో 5లక్షల మందికి పైగా విద్యార్థులు వేర్వేరు కళాశాలల్లో చదువుతున్నారు. వీరంతా బస్‌పాస్ రెన్యూవల్ కోసం ప్రతినెలా వరుసలో ఉండాల్సిన సమస్య తీరనుంది. ఇందుకు ఆర్టీసీ ప్రత్యేక యాప్ ప్రవేశపెట్టే యోచనలో ఉంది. యాప్‌తో బస్ పాస్‌లు పొందే వెసులుబాటు కలగనుంది. పాస్‌ను కండక్టర్‌కు మొబైల్‌లోనే చూపించి ప్రయాణించొచ్చు.

# కాటమయ్య కిట్టు .. ప్రాణాలకు భరోసా



సిరిసిల్ల : కల్లు గీత కార్మికులు తాటి, ఈత చెట్టు ఎక్కే సమయంలో ప్రమాదం జరుగుతుండటంతో తీవ్ర గాయాల పాలవుతున్నారు. కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇక నుంచి ఏ ఒక్క గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి ప్రాణాలు కోల్పోకుండా చూడాలని భావించింది. ప్రమాదాల బారి నుంచి రక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లను తయారు చేయించి పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లా బీసీ సంక్షేమ శాఖ, ఆబ్కారీ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో 400 మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఇప్పటికే వాటిపై శిక్షణ కూడా ఇచ్చారు. తాటి, ఈత చెట్లు ఎక్కేటప్పుడు వీటిని ధరించడం వల్ల ప్రమాదం జరగకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**ఆరు రకాల వస్తువులు**

కల్లుగీత కార్మికులకు అందించే కాటమయ్య రక్షణ కవచం కిట్టులో ఆరు రకాల వస్తువులు ఉన్నాయి. తాడు, క్లిప్పులు, హ్యాండిల్, స్లింగ్ బ్యాగ్, లెగ్‌లూప్ వంటివి ఉన్నాయి.

తాటి చెట్టు ఎక్కే సమయంలో నడుముకు ముత్తాదు, చెట్టు ఎక్కడానికి ఉపయోగించే మోకుతో పాటు రెండు కాళ్లకు గుయి ధరించి ఎక్కుతారు. ఎక్కే సమయంలో ప్రమాదవశాత్తు మోకు జారినా, లేక రెండు కాళ్లకు ఉన్న గుయి పడిపోయినా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నుంచి రక్షించడానికి ప్రత్యేకంగా కాటమయ్య రక్షణ కవచం కిట్లను తయారు చేశారు.

కిట్టులోని పరికరాలను నడుముకు బిగించుకొని తాడుతో మోకుకు అనుసంధానం చేసి చెట్టు ఎక్కాలి. ప్రమాదవశాత్తు మోకు జారిపోయినా, గుయి కింద పడినా జారి పడకుండా కిట్టుకు ఉన్న తాడు చెట్టుకు బిగుసుకుపోతుంది. దీంతో చెట్టుపై నుంచి పడకుండా అక్కడే ఉండి పోతారు. అనంతరం వారు కాలికి ధరించిన లెగ్‌లూప్ సహాయంతో చెట్టును సులభంగా దిగ గలుగుతారు.


ఈ కిట్టు 2,200 కిలోల బరువును ఆపుతుంది.

**సద్వినియోగం చేసుకోవాలి:** రాజమనోహర్‌రావు, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి గీత కార్మికులకు అందించిన కాటమయ్య రక్షణ కవచం కిట్లను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే ఈ కిట్టు వినియోగంపై గీత కార్మికులకు శిక్షణ అందించాం. దీనిని ధరించి ప్రమాదం జరగకుండా చూసుకోవాలి.

# 'ప్రశస్త'తో దివ్యాంగ లక్షణాల గుర్తింపు

ఇబ్రహీంపట్నం: పిల్లల్లో దివ్యాంగ లక్షణాలు ఉంటే సరైన సమయంలో గుర్తించి, చికిత్స అందించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి సంకల్పించింది. బాల్యంలోనే దివ్యాంగ లక్షణాలు కనిపించినా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించక పోవడంతో వయస్సు పెరుగుతున్న కొద్దీ సమస్యలు తీవ్రమవుతాయి. దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, చికిత్స అందించడం ద్వారా మెరుగైన జీవనం గడపగలరు. చిన్నారుల్లో దివ్యాంగ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో ప్రశస్త ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించింది. దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి లోపు పిల్లల్లో మూడు దశల్లో దివ్యాంగ లక్షణాల నిర్ధారణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. విద్యార్థులు ఇంట్లో కంటే పాఠశాలలోనే అధిక సమయం గడుపుతారు. ఈ క్రమంలో చిన్నారుల నడకలో తేడా, లేదంటే నడవడానికి ఇతరుల సహాయం తీసుకోవడం, శరీరంలోని భాగాల కదలికలో తేడా, మెడ, చేతులు, వేళ్లు, మణికట్టు, కాళ్లు వంటి 21 రకాల దివ్యాంగ లక్షణాలను ఉపాధ్యాయులు గుర్తించే అవకాశం అధికంగా ఉంటుంది. దివ్యాంగ లక్షణాలు గల చిన్నారులను గుర్తించి వారిని ప్రశస్త యాప్‌లో పొందుపరుస్తారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చరవాణుల్లో మెయిల్ ద్వారా యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థుల్లో దివ్యాంగ లక్షణాల గుర్తింపు ప్రక్రియ మూడు దశల్లో జరగనుంది. మొదటిదశలో ఉపాధ్యాయుడు రెండు వారాలపాటు




గమనించి వివరాలను 26లోగా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రెండో దశలో గుర్తించిన విద్యార్థులను శిక్షణ పొందిన నిపుణులు గమనించి మరోమారు యాప్‌లో నమోదు చేస్తారు. చివరి దశలో విద్యార్థి తల్లిదండ్రులకు వివరించి, బాల్యంలోనే మెరుగైన చికిత్స అందించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చి వారి అనుమతి మేరకు పరీక్షలకు పంపించనున్నారు.

# మోసం కొండంత.. వసూలు గోరంత!

కరీంనగర్: జగిత్యాల కేంద్రంగా జరిగిన జీఎస్టీ మోసం కథ ఎటూ తేలడం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోని ఐటీసీ (ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్) రూపంలో జరిగిన అక్రమ బాగోతం తాలూకు విచారణ ఇంకా నడుస్తూనే ఉంది. సుమారు 9 నెలల కిందట జగిత్యాలకు చెందిన జీఎస్టీ ప్రాక్టీషనర్ తప్పుడు ధ్రువపత్రాలతో బోగస్ సంస్థలను ఏర్పాటు చేసి దాదాపుగా రూ.288 కోట్ల ఆర్థిక మోసానికి పాల్పడ్డారని అధికారులు గుర్తించారు. కాగితాలపైనే సృష్టించిన పలు బోగస్ కంపెనీలకు ఆ సొమ్మును బదలాయించారు. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించిన వాణిజ్య పన్నుల అధికారులు మొదట విస్తుపోయారు. తీరిగ్గా తేరుకుని బాధ్యుడిగా గుర్తించిన వ్యక్తి కార్యాలయంలో సోదాలు చేపట్టారు. పలు పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేసి అరెస్ట్ చేయించారు. తరువాత ఈ విచారణను హైదరాబాద్ నుంచి వచ్చిన వాణిజ్య పన్నుల శాఖ విజిలెన్స్ అధికారులు చేపట్టారు. తమ సంస్థలను మూసివేయమని జీఎస్టీ ప్రాక్టిషనర్ వద్దకు వచ్చిన కొందరు వ్యాపారుల ఆధార్ కార్డులను ఉపయోగించి ఆన్‌లైన్‌లో ఈ కుంభకోణానికి తెరతీసినట్లు విచారణలో గుర్తించారు. ఇలా 32 బోగస్ కంపెనీలను ఏర్పాటు చేసి సిమెంట్, ఐరన్ వ్యాపారాలు చేస్తున్నట్లు కాగితాల్లోనే నమ్మించాడు. ఆ బోగస్ సంస్థలకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో జమ అయిన మొత్తం డబ్బులను 302 మంది వ్యాపారులకు బదిలీ అయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన సంస్థలకు ఈ నగదు వెళ్లినట్లు గమనించారు. ఇందులో పెద్దమొత్తంలో ఒక సంస్థకు రూ.120 కోట్లు బదలాయింపు జరిగిన తీరు తెలుసుకుని అధికారులు నివ్వెరపోయారు.

**వచ్చింది 5 శాతమే**



కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఈ అక్రమంలో భాగమైన బాధ్యుడిని గుర్తించి పట్టుకున్నప్పటికీ.. పక్కదారి పట్టిన సొమ్మును తిరిగి వసూలు చేయడం అధికారులకు తలకు మించిన భారంగానే మారింది. ఇప్పటి వరకు గుర్తించిన పలువురు వ్యాపారులు, సంస్థల నుంచి రూ.13 కోట్లకుపైగా డబ్బును రాబట్టినట్లు తెలిసింది. మొత్తం మోసంలో ఇప్పటివరకు రికవరీ అయింది కేవలం 5 శాతమే. మూడు నెలల కిందటి వరకు రూ.11 కోట్లు రాగా.. ఇటీవల ఈ మొత్తం రూ.13 కోట్లను దాటినట్లు సమాచారం. జగిత్యాల కేంద్రంగా జరిగిన ఈ భారీ మోసాన్ని అప్పట్లో సవాలుగా తీసుకున్న అధికారులు కాలక్రమేణా ఇతర పనుల్లో తీరిక లేకుండా పోవడంతో విచారణలో దూకుడు ప్రదర్శించడం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా పోలీసులు, వాణిజ్య పన్నుల అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే ఇంకా ఇందులో భాగమైన వారెవరనేది బాహ్య ప్రపంచానికి తెలిసే అవకాశముంది. పైగా రాష్ట్రంలోనే బోగస్ సంస్థలు ఏర్పాటు చేసి సొమ్మును బదలాయించినట్లు గుర్తించిన అధికారులు అందులో కొందరికి సర్‌ఛార్జ్ నోటీసులు అందించినట్లు తెలుస్తోంది. తరువాత రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టాన్ని ఉపయోగించి పోయిన నగదును తిరిగి చేజిక్కించుకునే విషయమై కసరత్తు చేసింది. పూర్తిస్థాయిలో మోసపోయిన సొమ్మును వసూలు చేయడం కష్టసాధ్యంగా ఆ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ విషయమై వాణిజ్య పన్నుల శాఖ కరీంనగర్ డివిజన్ జాయింట్ కమిషనర్ రవికుమార్‌ను సంప్రదించగా రికవరీ ఎంత చేశారనేది ఈ కేసుని పర్యవేక్షిస్తున్న హైదరాబాద్‌లోని అధికారులకే తెలుస్తుందన్నారు.

# ఆర్టీసీకి దసరా పండుగ

కరీంనగ: రవాణా విభాగం: దసరా పండుగ ఆర్టీసీకి గణనీయ ఆదాయం తెచ్చింది.. రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులు నడపడం.. లక్షలాది మంది బస్సుల్లో ప్రయాణించడంతో సంస్థకు రూ.కోట్ల ఆదాయం సమకూరింది. పాఠశాలలకు ఈ నెల 2న సెలవులు ప్రకటించగా 1వ తేదీ సాయంత్రం నుంచే ప్రారంభమైన రద్దీ 16వ తేదీ వరకు కొనసాగింది.. సంస్థ రూ.31.49 కోట్ల ఆదాయం ఆర్జించింది.

**ప్రత్యేక ఏర్పాట్లతో..**

పండుగల సందర్భంగా రద్దీ అధికంగా ఉంటుందని భావించిన ఆర్టీసీ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో సాగారు. జేబీఎస్‌తోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, హనుమకొండ ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడిపారు. సరిపడా బస్సులు లేకపోవడంతో హైదరాబాద్ నుంచి సిటీ బస్సులను తెప్పించి రద్దీకి అనుగుణంగా పంపించారు. ఈ నెల 3 నుంచి 11 వరకు డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు, సూపర్‌వైజర్లు జేబీఎస్‌లో మకాం వేసి రద్దీని పరిశీలిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు ఎస్.భూపతిరెడ్డి, సత్యనారాయణ కరీంనగర్ బస్టాండ్‌లోనే ఉంటూ రద్దీని స్వయంగా పరిశీలిస్తూ ఆయా రూట్లలో బస్సులు తిరిగేలా చూశారు.

**డిపోల వారీగా..**

ఆదాయపరంగా గోదావరిఖని డిపో రూ.5.27 కోట్లతో మొదటి స్థానంలో నిలవగా, హుస్నాబాద్ డిపో రూ.1.43 కోట్లతో చివరి స్థానంలో నిలిచింది. ప్రయాణికులపరంగా గోదావరిఖని డిపో 9.79 లక్షల మంది ప్రయాణికులను (మహిళలు 6.87లక్షలు) చేరవేసి ప్రథమ స్థానంలో నిలవగా, వేములవాడ డిపో 5.16 లక్షల మందిని (మహిళలు 3.95 లక్షలు) చేరవేసి చివరి స్థానంలో నిలిచింది.

**సమష్టి కృషితోనే సాధ్యమైంది :** లక్షలాది ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చడంలో సిబ్బంది పాత్ర ప్రశంసనీయం. డ్రైవర్లు, కండక్టర్లు, కంట్రోలర్లు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు ఇతర సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాం.

సుచరిత, రీజినల్ మేనేజర్, కరీంనగర్ రీజియన్

# బండి సంజయ్‌పై ఓ రేంజ్‌లో ఫైర్ అయిన కడియం



జనగామ, అక్టోబర్ 21: కేంద్రమంత్రి బండి సంజయ్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడతూ.. బండి సంజయ్ కేంద్రమంత్రి అని మరిచిపోయి సిగ్గు లేకుండా నడిరోడ్లపై దాడులు చేస్తున్నారని.. జ్ఞానం ఉందా అంటూ విరుచుకుపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాల్సింది పోయి రోడ్డు మీద కూర్చోవడం పద్ధతేనా అని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధిపై బీఆర్ఎస్‌కు, బీజేపీకి ప్రేమ లేదని.. అధికారం కోసం పోటీపడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి చక్కగా పరిపాలిస్తున్నారని అన్న ఎమ్మెల్యే.. ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఏడు లక్షల కోట్ల అప్పులలో రాష్ట్రం ఉందన్నారు. వడ్డీలు, జీతాలు, పెన్షన్లు, అభివృద్ధి కార్యక్రమాలకు మిగులుబాటు లేదని.. సర్దుబాటు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. రేవంత్ రెడ్డి సంకల్పానికి మనందరం సపోర్టుగా నిలవాలన్నారు. ఆయన ధైర్యంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ మాయమాటలు నమ్మితే నష్టపోతామన్నారు. బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తోందని వ్యాఖ్యలు చేశారు. ఐదేండ్లలో కల్వకుంట్ల కుటుంబం దోపిడి చేసిందని ఆరోపించారు. 2014లో కేసీఆర్ కుటుంబం మొత్తం ఆస్తులు ఎంత.. ఇప్పుడు కేసీఆర్ ఆస్తులు ఎంత.. దమ్ముంటే ప్రజల ముందుకు చర్చకు రావాలని సవాల్ విసిరారు. హరీష్ రావు నిజాయితీ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నారు సిగ్గుందా అంటూ మండిపడ్డారు. జనగామలో ప్రతాపరెడ్డి నాయకత్వంలో వచ్చే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. 10 ఏళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అమాయకులైన నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు, కేటీఆర్‌లు.. బీజేపీ పార్టీలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్ ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారన్నారు. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ముప్పేట దాడులు చేస్తున్నాయన్నారు. రేవంత్ రెడ్డి సంకల్పానికి ప్రతి ఒక్కరు అండగా నిలబడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

**అసలేం జరిగిందంటే..** కాగా.. శనివారం (అక్టోబర్ 19) గ్రూప్-1 అభ్యర్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన చలో సచివాలయం ముట్టడి ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు ఉద్రిక్తత మధ్య జరిగిన ర్యాలీలో బండి సంజయ్‌ని పోలీసులు అదుపులో తీసుకొని.. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. జీవో నెంబర్ 29ని రద్దు చేసి జీవో నెం 55ను అమలు చేయాలంటూ నిరుద్యోగులు ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. వీరి నిరసనకు బండి సంజయ్ మద్దతు తెలిపారు. బండి సంజయ్‌తో పాటు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అశోక్‌నగర్ చేరుకుని ఆందోళన చేస్తున్న అభ్యర్థులకు మద్దతు తెలుపుతూ రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేంద్రమంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. చివరకు తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద బండిసంజయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అక్కడి నుంచి బీజేపీ కార్యాలయానికి కేంద్రమంత్రిని తరలించారు.

# అంతా చేసింది పోలీసులే.. ఎంపీ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, అక్టోబర్ 21: హిందూ దేవాలయాల మీద కొంతమంది దాడి చేస్తున్నారని.. దీనిపై ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ముత్యాలమ్మ గుడిపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం నేతలు రాజ్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేస్తే నిందితుడిని పిచ్చోడని ముద్ర వేసి వదిలేసే ప్రయత్నం చేశారని ఈటల మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా కొంతమంది చేస్తున్నారన్నారు. శాంతియుతంగా ర్యాలీ తీస్తుంటే పోలీసులు దుర్మార్గంగా లాఠీ ఛార్జ్ చేసి అరెస్టులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రదాడులకు నగరంలో ఎంతో మంది బలయ్యారన్నారు. మళ్లీ అలాంటి దాడులకే దుర్మార్గులు కుట్ర చేస్తున్నారని.. నిందితులను కఠినంగా శిక్షించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి సూచించాలని గవర్నర్‌ను కోరామన్నారు. పోలీసులే మఫ్టీలో రెచ్చగొట్టి ర్యాలీలో దాడులు, లాఠీఛార్జ్ జరిగేలా చేశారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. హిందూ దేవాలయాల మీద దాడి జరిగితే సీఎం రేవంత్ ఇంత వరకు ఖండించలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం నిరంకుశ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. హిందూ దేవాలయాల మీద దాడి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిందితుల మీద ప్రభుత్వం కేసు పెట్టకుండా ఏం చేస్తోందని ప్రశ్నించారు. వంద మంది నగరంలో దాడులకు కుట్ర చేసినట్లు తెలుస్తోందని.. రాష్ట్ర ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని నిలదీశారు. "దేవాలయాల మీద దాడి మా తల్లి మీద దాడిలా భావిస్తాం... తిప్పికొడతాం" అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

**డీజీపీని కలిసిన బృందం :** గవర్నర్‌ను కలిసిన అనంతరం బీజేపీ బృందం డీజీపీ ఆఫీసుకు బయలుదేరింది. గవర్నర్ కార్యాలయం నుంచి డీజీపీ ఆఫీస్‌కు ఒకే కారులో ఎంపీలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు వెళ్లారు. ఈ సందర్భంగా నేతలున్న కారును ఎంపీ రఘునందన్ రావు స్వయంగా నడిపారు. కాసేపటికే డీజీపీ కార్యాలయానికి చేరుకున్న తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల బృందం.. డీజీపీ జితేందర్‌ను కలిశారు. ముత్యాలమ్మ గుడి ఇష్యూ, హిందూ సంఘాల లాఠీఛార్జ్ అక్రమ కేసులపై ఫిర్యాదు చేశారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

# అర్థరహిత ఆలోచనలతో పారిశ్రామిక రంగానికి దెబ్బ: కేటీఆర్

హైదరాబాద్: విద్యుత్ అనేది రాష్ట్ర అభివృద్ధితో ముడిపడిన అంశమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ను కలిసినట్లు చెప్పారు. 300 యూనిట్లు దాటితే ప్రస్తుతం యూనిట్‌కు రూ.10 ఫిక్స్‌డ్ ఛార్జీ వసూలు చేస్తున్నారని, ఆ పరిధి దాటితే ప్రస్తుతం ఉన్నదానికంటే 5 రెట్లు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించిందని అన్నారు. ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. " పరిశ్రమలన్నింటికీ ఒకే విధానం అమలు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటికే అసంబద్ధ విధానాల వల్ల పరిశ్రమలు వెళ్లిపోతున్నాయి. అర్థరహిత ఆలోచనల వల్ల పారిశ్రామిక రంగం మరింత దెబ్బతింటుంది. గతంలో ట్రూఅప్ ఛార్జీలు రూ.12,500 కోట్లు




పెంచాలని విద్యుత్ సంస్థలు కోరాయి. ఆ భారాన్ని గతంలో ప్రభుత్వమే భరించింది. ప్రజలపై వేయలేదు" అని కేటీఆర్ తెలిపారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు.. రేవంత్ ప్రభుత్వంపై ఎంపీ రఘునందన్ రావు ధ్వజం

హైదరాబాద్: రాష్ట్రంలో మందిరాలపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరపాలని డీజీపీకి విజ్ఞప్తి చేశామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. పర్సనాలిటీ డెవలప్మెంట్ పేరుతో సమాజాన్ని విచ్చిన్నం చేసే ట్రైనింగ్ ఇస్తున్నారని చెప్పారు. ఇవాళ డీజీపీని ఎంపీ రఘునందన్ రావు కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో రఘునందన్ రావు మాట్లాడుతూ.... డీజీపీకి విషయం తెలిసిన ఆయన మౌనంగా ఉంటున్నారని తెలిపారు. ముత్యాలమ్మ దేవాలయం ఘటనలో అరెస్ట్ చేసిన హిందువులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్ స్లీపర్స్ సెల్స్ కు ట్రైనింగ్ ఇస్తున్నారని ఆరోపించారు. ఇది పోలీసులకు సమాజానికి మంచిది కాదని అన్నారు. రాజకీయ అవసరం కోసం దీనిని డైవర్ట్ చేయొద్దని అన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




మాజీ మంత్రి, మల్కాజిగిరి భారాస ఎమ్మెల్యే మల్లారెడ్డి .. తన మనుమరాలి పెళ్లి సంగీత్‌లో డ్యాన్స్‌లతో అదరగొట్టారు. మర్రి రాజశేఖర్ రెడ్డి కుమార్తె వివాహం ఈనెల 27న జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత్‌లో మల్లారెడ్డి స్టెప్పులేసి అతిథుల్లో జోష్ నింపారు. కొరియోగ్రాఫర్‌తో శిక్షణ తీసుకుని మరీ ప్రత్యేక స్టెప్పులు వేశారు.

# ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయండి: సీఎం రేవంత్



హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. "గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు నా శుభాకాంక్షలు. ఎటువంటి ఆందోళన చెందకుండా పూర్తి ఏకాగ్రతతో పరీక్షలు రాయండి. ఈ పరీక్షల్లో మీరు విజయం సాధించి తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని సీఎం పేర్కొన్నారు.

# రైతులకు గిట్టుబాటు ధర అందించాలనేదే మా ప్రభుత్వ సంకల్పం: మంత్రి తుమ్మల

ఖమ్మం: రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని గుర్రాలపాడులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈసారి పత్తి దిగుబడి తగ్గిందన్నారు. ఖమ్మం జిల్లాలో 17 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. జిల్లాలో 9 సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు.

"రైతులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ, మార్కెటింగ్ అధికారులే చూడాలి. అన్నదాతలను మోసం చేసే ప్రైవేటు వ్యాపారులపై చర్యలు తప్పవు. రైతులు సంప్రదాయ పంటల నుంచి ఉద్యాన పంటల వైపు మళ్లాలి. పత్తి, మిర్చి స్థానంలో పామాయిల్ సాగు చేస్తే అధిక లాభం. పంటలకు గిట్టుబాటు ధర అందించాలనేదే మా ప్రభుత్వ సంకల్పం" అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



**ప్రతి బస్తా కొనుగోలు చేస్తాం: కొండా సురేఖ...** వరంగల్‌లోని ఎనుమాముల మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. రైతులు నాణ్యమైన పత్తి తెచ్చి గరిష్ట ధర పొందాలని ఆమె సూచించారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతి బస్తా కొనుగోలు చేస్తామని తెలిపారు.




# గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

దిల్లీ: తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. వాదనల సందర్భంగా.. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 పరీక్ష జరుగుతోందని అభ్యర్థుల తరఫు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తెచ్చిందని తెలిపారు. పరీక్షపై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది చెప్పారు. ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు గ్రూప్-1 పరీక్ష నిలుపుదల కుదరదని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు.

వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# తిరుమలలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



తిరుమల, అక్టోబర్ 21: తిరుపతిలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చెలరేగిన దుమారం ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతుంది. అలాంటి వేళ తెలంగాణలోని జెడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వెంకన్నదర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్స్ లేఖలు అనుమతించక పోవడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల వ్యవహారశైలిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఏడుకొండలవాడిని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ...తిరుమలలో స్వామి వారి దర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల జారీ చేసే సిఫార్స్ లేఖలు అనుమతించకపోవడం బాధాకరమన్నారు. డెయిల్ యువర్ ఈవో కార్యక్రమంలో సైతం టీటీడీ ఈవో సైతం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్స్ లేఖను అనుమతి ఇవ్వమని స్పష్టం చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గుర్తు చేశారు. అయితే తమ తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు యాదాద్రి, భద్రాచలంలో దేవుడు దర్శనానికి వచ్చే ఆంధ్ర ప్రజా ప్రతినిధుల సిఫార్స్ లేఖలను తమ ప్రభుత్వం అనుమతి ఇస్తుందని తెలిపారు. కానీ తమ తెలంగాణ విషయంలో ఎందుకు చిన్న చూపు చూస్తున్నారని ఈ సందర్భంగా టీటీడీ అధికారులను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తమ సొంత మనుషులు, పార్టీ కార్యకర్తలు తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్తాం.. రూమ్ ఇప్పించండి అంటే.. ఇప్పించలేని దుస్థితి నేడు నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే తెలుగుదేశం పార్టీ వాళ్లు హైదరాబాద్‌లో ఆశ్రయం పొందుతారని పేర్కొన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వం కొలువు తీరితే.. వైసీపీ వాళ్లు హైదరాబాద్ వచ్చి ఉంటారన్నారు. ఏపీ వాళ్లు హైదరాబాద్‌లో బిజినెస్ చేసుకున్నా.. తెలంగాణ వాళ్లు ఏనాడు ఒక్క మాట కూడా వాళ్లని అనలేదన్నారు. తెలంగాణ ఎమ్మెల్యే అంతా ఏపీ వాళ్లను తమ రాష్ట్రానికి రావొద్దని ఓ తీర్మానం చేసుకుంటే.. ఆ బాధేమిటో మీకు తెలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్స్ లేఖలు టీటీడీ అనుమతించక పోతే.. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తాము తీసుకునే నిర్ణయంతో బాధ పడాల్సి వస్తుందని ఈ సందర్భంగా తిరుమలలో ఎమ్మెల్యే అనిరుధ్ హెచ్చరించారు. ఇరు రాష్ట్రాల ప్రజలు అన్నదమ్ములన్నారు. అలాగే ఉందాం. కేవలం వ్యాపారం కోసం హైదరాబాద్‌కు రాకండి.. నిజమైన అన్నదమ్ముల వలే ఉందామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన సూచించారు. రాష్ట్ర విభజన సమయంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు తనకు రెండు కళ్లు అని పేర్కొన్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మరి చంద్రబాబు ఒక కన్ను తీసేసుకున్నారా? అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ¡EDITOR : SYED. KAREEMî CELL - 94409 77660